## విలేకరులు కావలెను

హిందుస్థాన్ మీడియా తెలుగు దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ రాష్ట్రాలలో జిల్లా రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జులు, మండలాలవారిగా విలేకరులు కావలెను. అనుభవం కలవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించండి
9000306455



epaper.hindusthanmedia.com APTEL / 2004 / 19136

# హిందుస్థాన్ మీడియా

తెలుగు దినపత్రిక సామాన్యుడి నేస్తం






ఎడిటర్ : తాడెం. ప్రశాంత్ సిద్దిపేట సంపుటి : 1 సంచిక : 76 శుక్రవారం జూలై 17 2026, పేజీలు - 4 వెల :2/-


## గ్రేటర్‌లో మొదలైన ఆషాఢ బోనాల సంబురాలు.. శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్

-హైదరాబాద్‌లో వైభవంగా ప్రారంభమైన ఆషాఢ బోనాలు
-ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి
-ఉత్సవాల నిర్వహణకు రూ. 20 కోట్లు కేటాయించిన ప్రభుత్వం
-భక్తులకు ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు

హిందూస్థాన్ మీడియా

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలోని వేలాది ఆలయాల్లో ఆషాఢ బోనాల జాతర కోలాహలంగా ప్రారంభమైంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ ఉత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు, భక్తులకు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. గురువారం నాడు హైదరాబాద్‌లో ఈ వేడుకలు ఘనంగా అంకురార్పణ చేసుకున్నాయి.బోనాల పండుగ సామాజిక ఐక్యతకు నిదర్శనమని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉత్సవాలను సజావుగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 20 కోట్లను కేటాయించిందని ఆయన వెల్లడించారు. ఆలయ ప్రాంగణాల్లో పారిశుధ్యం, తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, వైద్య సేవలతో పాటు పటిష్టమైన పోలీసు భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఆయన వివరించారు.మహంకాళి అమ్మవారికి



అంకితం చేసే ఈ బోనాల ఉత్సవాలను దేవాదాయ శాఖ పరిధిలోని 3 వేలకు పైగా ఆలయాల్లో అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఆగస్టు మధ్య వరకు ఈ వేడుకలు కొనసాగనున్నాయి. భక్తులందరూ భక్తిశ్రద్ధలతో ఈ వేడుకల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ముఖ్యమంత్రి కోరారు.భారీ సంఖ్యలో తరలివచ్చే భక్తులను దృష్టిలో ఉంచుకుని వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో అధికారులు ఇప్పటికే సమీక్షలు నిర్వహించి, ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ ఏడాది పలు ఇతర మున్సిపల్ కార్పొరేషన్లకు కూడా ఈ ఉత్సవాలను విస్తరించడం విశేషం.

## కరోనా కలకలం... నలుగురి మృతి

హిందూస్థాన్ మీడియా

ఆంధ్రప్రదేశ్‌లో కరోనా మహమ్మారి మళ్లీ కలకలం రేపుతోంది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కొత్తగా కోవిడ్-19 పాజిటివ్ కేసులు నమోదవడంతో ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. తక్షణమే అప్రమత్తంగా ఉండాలని జిల్లా అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేసింది వివరాల్లోకి వెళితే, జూన్ 26వ తేదీ నుంచి జులై 16 వరకు రాష్ట్రంలో మొత్తం 12 కరోనా పాజిటివ్ కేసులు వెలుగు చూశాయి. ఈ కేసులను కడప, విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు జిల్లాల్లో గుర్తించారు. ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, ఈ కేసుల్లో నలుగురు మరణించినట్లు ఆరోగ్య శాఖ వర్గాలు ధ్రువీకరించాయి. మిగిలిన బాధితుల్లో ముగ్గురు ప్రస్తుతం హోం ఐసోలేషన్‌లో ఉండగా, ఇతరులు వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. కరోనా లక్షణాలు కనిపించిన వారికి వెంటనే పరీక్షలు నిర్వహించాలని జిల్లా వైద్యాధికారులను ఆదేశించింది. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందులు, టెస్టింగ్ కిట్లు, ఆక్సిజన్ నిల్వలను సిద్ధంగా ఉంచుకోవాలని స్పష్టమైన సూచనలు ఇచ్చింది. ప్రస్తుతానికి కేసుల సంఖ్య తక్కువగానే ఉన్నప్పటికీ, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ఏమాత్రం నిర్లక్ష్యం చేయవద్దని అధికారులు సూచిస్తున్నారు. పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నట్లు తెలిపారు.

## పీపీపీతోనే వేగంగా అభివృద్ధి.. 'వీజీఎఫ్ విప్లవం'పై సీఎం చంద్రబాబు దృష్టి

హిందూస్థాన్ మీడియా

రాష్ట్రంలో అభివృద్ధిని వేగవంతం చేసేందుకు ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) విధానమే కీలకమని, భవిష్యత్తులో వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్)తో కూడిన ప్రాజెక్టులు విప్లవాత్మక మార్పులు తేనున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పీపీపీ ప్రాజెక్టులు, ప్రభుత్వ వ్యయంపై గురువారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. త్వరలోనే 'ఆంధ్రప్రదేశ్ పీపీపీ-వీజీఎఫ్ పాలసీ 1.0'ను కేబినెట్ ముందుకు తీసుకురావాలని, దీనికి సంబంధించిన మార్గదర్శకాలు విడుదల చేయాలని ఆదేశించారు ప్రస్తుతం రాష్ట్రంలో పోర్టులు, ఎయిర్‌పోర్టులు, పర్యాటకం సహా వివిధ రంగాల్లో రూ.1,23,229 కోట్ల విలువైన 260 ప్రాజెక్టులు పీపీపీ విధానంలో పురోగతిలో ఉన్నాయని ఆర్థిక శాఖ అధికారులు సీఎంకు వివరించారు. పీపీపీ కింద చేపట్టిన వైద్య కళాశాలల నిర్మాణ విధానాన్ని కేంద్ర ఆర్థిక వ్యవహారాల విభాగం ప్రశంసించిందని, ఈ ప్రాజెక్టులకు రూ.1,468 కోట్ల వీజీఎఫ్ రానుందని తెలిపారు. అలాగే, విజయవాడ, తిరుపతిలోని వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లకు కేంద్రం రూ.178 కోట్ల వీజీఎఫ్ అందిస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, ప్రతీ ప్రాజెక్టును ఆర్థిక కార్యకలాపాలకు అవకాశం ఉండేలా సస్టెయినబుల్ మోడల్‌లో అభివృద్ధి చేయాలని సూచించారు. కోస్టల్ టూరిజం ప్రాజెక్టులలో స్థానిక మత్స్యకారులను భాగస్వాములను చేసి వారికి ప్రయోజనం చేకూర్చాలన్నారు. రాష్ట్రంలోని 21 ప్రధాన దేవాలయాల వద్ద మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ప్రభుత్వం వద్ద నిరుపయోగంగా ఉన్న ఆస్తులను అవకాశాలుగా మార్చుకోవాలని సీఎం దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని బస్టాండ్ల వద్ద ఉన్న భూములను వాణిజ్యపరంగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రతీ ప్రభుత్వ శాఖ ఆదాయ మార్గాలను పెంచుకునేందుకు స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ఫైనాన్షియల్ ప్లాన్‌ను సిద్ధం చేసుకోవాలని స్పష్టం చేశారు. బలహీన వర్గాల విద్యార్థులను నైపుణ్యం ఉన్న మానవ వనరులుగా తీర్చిదిద్దేందుకు, రెసిడెన్షియల్ హాస్టళ్ల సామర్థ్యాన్ని రెట్టింపు చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## అమరావతిలో జగన్నాథ రథయాత్ర.. బంగారు చీపురుతో ఊడ్చి సేవ చేసిన సీఎం చంద్రబాబు

హిందూస్థాన్ మీడియా

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో తొలిసారిగా జగన్నాథ రథయాత్ర అత్యంత వైభవంగా జరిగింది. వెంకటపాలెంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి ప్రారంభమైన ఈ యాత్రలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూరీలో నిర్వహించే సంప్రదాయ క్రతువు తరహాలో రథం ముందు భాగాన్ని బంగారు చీపురుతో ఊడ్చి శుభ్రం చేసి చంద్రబాబు తన సేవను చాటుకున్నారు. అనంతరం జగన్నాథుడు, బలభద్ర, సుభద్రలు ఆశీనులైన రథాన్ని తాడుతో లాగి యాత్రను ప్రారంభించారు.ఈ మహోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి పి.నారాయణ, స్థానిక శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, వేలాదిగా భక్తులు పాల్గొని రథాన్ని లాగారు. ఈ సందర్భంగా, అమరావతి బృహత్ ప్రణాళిక చిత్రపటాన్ని శిరస్సు పై ధరించి, రాజధాని నగరం విశ్వనగరంగా ఎదగాలని ఆయన జగన్నాథ స్వామిని ప్రార్థించారు.అనంతరం జరిగిన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. దేశంలో పూరీ జగన్నాథ రథయాత్రకు ఎంతో విశిష్టత ఉందని, అందరూ అక్కడికి వెళ్లలేరని, అలాంటిది తొలిసారిగా అమరావతిలో ఈ యాత్ర నిర్వహించడం ఆనందదాయకమని అన్నారు. ఈ యాత్రలో పాల్గొనడం తన పూర్వజన్మ సుకృతమని పేర్కొన్నారు. ఇకపై ప్రతిఏటా అమరావతిలో జగన్నాథ రథయాత్ర నిర్వహిస్తామని ఇస్కాన్ ప్రకటించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఇస్కాన్, అక్షయపాత్ర ఫౌండేషన్‌లు అందిస్తున్న సేవలను చంద్రబాబు కొనియాడారు. దేశంలోని 16 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాల్లో 25 వేలకు పైగా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్షయపాత్ర నాణ్యమైన ఆహారాన్ని అందిస్తోందని తెలిపారు. ప్రపంచంలోనే ఇంత పెద్ద ఎత్తున 500 కోట్ల మందికి ఆహారం అందించడం అరుదైన విషయమని ప్రశంసించారు. ఏపీలో 10 సెంట్రలైజ్డ్ కిచెన్ల ద్వారా రోజూ 1.80 లక్షల మంది విద్యార్థులకు భోజనం అందిస్తున్నట్లు వివరించారు.ఆధునిక జీవనశైలి వల్ల ఎదురవుతున్న సమస్యలను



ప్రస్తావిస్తూ, మానవ సంబంధాలు తగ్గి సామాజిక మాధ్యమాల ప్రతికూల ప్రభావం కుటుంబాలపై పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీని కారణంగా కొన్ని కుటుంబాల్లో ఆత్మహత్యలు, చిన్నారులపై అఘాయిత్యాలు జరుగుతున్నాయని, జీవితాల్లో ఒత్తిడిని దూరం చేసుకోవాలంటే ఆధ్యాత్మికత ఒక్కటే మార్గమని స్పష్టం చేశారు. "మైక్రో ఫ్యామిలీలు కాదు, ఉమ్మడి కుటుంబాలు కావాలి. అదే మన భారతీయ సంప్రదాయం" అని ఆయన పిలుపునిచ్చారు. సమాజం ప్రశాంతంగా ఉండటానికి దేవాలయాలు దోహదపడతాయని, అందుకే రాష్ట్రంలో 5 వేల శ్రీవారి ఆలయాలను నిర్మించాలని నిర్ణయించినట్లు ప్రకటించారు. భారతీయ సంస్కృతిని కాపాడేందుకు ఇస్కాన్ వంటి సంస్థలతో కలిసి పనిచేస్తామని హామీ ఇచ్చారు అమరావతి, పోలవరం ప్రాజెక్టులను పూర్తి చేసి రాష్ట్ర ప్రజలకు మేలు చేయడమే తమ ప్రభుత్వ సంకల్పమని చంద్రబాబు పునరుద్ఘాటించారు. జగన్నాథ రథయాత్ర తలపెట్టగానే అమరావతిలో వర్షం కురిసి వాతావరణం చల్లబడటం శుభసూచకమని అన్నారు. ఆ జగన్నాథ స్వామి కృప రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు.

## హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు గుడ్ న్యూస్..

# రానున్న అదనపు కోచ్‌లు

హిందూస్థాన్ మీడియా



హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఎంఆర్ఎల్) శుభవార్త అందించింది. నగరంలో మెట్రో రైళ్లలో పెరుగుతున్న రద్దీని తగ్గించేందుకు ఫేజ్-1 నెట్‌వర్క్‌లో అదనపు కోచ్‌లను చేర్చాలని నిర్ణయించింది. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ ఎక్కువగా ఉండే స్టేషన్లలో ప్రయాణికులకు వెసులుబాటు కల్పించేలా ఈ చర్యలు చేపట్టింది. ప్రస్తుతం 69 కిలోమీటర్ల మేర ఉన్న ఫేజ్-1 కారిడార్‌లో మూడు కోచ్‌లతో కూడిన రైళ్లు నడుస్తున్నాయి. అయితే, ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరగడంతో ఈ కోచ్‌లు సరిపోవడం లేదు. అమీర్‌పేట్, మియాపూర్, రాయదుర్గం, హైటెక్ సిటీ వంటి కీలక స్టేషన్లలో ప్రయాణికుల రద్దీ విపరీతంగా ఉంటోంది. ఈ నేపథ్యంలో, కొత్త కోచ్‌ల కొనుగోలు నిమిత్తం తయారీదారులతో వెంటనే చర్చలు ప్రారంభించాలని హెచ్ఎంఆర్ఎల్ అదనపు మేనేజింగ్ డైరెక్టర్ బి. అజిత్ రెడ్డి బుధవారం అధికారులను ఆదేశించారు. ప్రయాణికుల సేవలు, మౌలిక వసతులపై జరిపిన సమీక్ష అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు. కోచ్‌ల పెంపుతో పాటు స్టేషన్ల వెలుపల రవాణా సౌకర్యాలను మెరుగుపరచడంపై అధికారులు దృష్టి సారించారు. ఫస్ట్, లాస్ట్ మైల్ కనెక్టివిటీ కోసం టీఎస్ఆర్టీసీ, రవాణా శాఖతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అలాగే, పాదచారుల రాకపోకలను సులభతరం చేయడం, మెట్రో స్టేషన్లకు అనుసంధానంగా ఉన్న స్కైవాక్‌ల నిర్వహణ, రద్దీ నియంత్రణకు వినూత్న వ్యూహాలను అమలు చేయాలని నిర్ణయించారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు, భద్రతతో పాటు స్టేషన్ల పరిశుభ్రతకు తమ మొదటి ప్రాధాన్యత ఉంటుందని హెచ్ఎంఆర్ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ శివేంద్ర ప్రతాప్ తెలిపారు. దీర్ఘకాలిక ప్రణాళికలో భాగంగా హైటెక్ సిటీ, గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి ఐటీ హబ్‌లను కలుపుతూ పబ్లిక్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ ఏర్పాటు ప్రతిపాదనను కూడా ప్రభుత్వం పరిశీలిస్తోందని అధికారులు పేర్కొన్నారు.

# మోదీ మౌనం వీడాలి!

-నీట్ లేకేజీ పై విచారణ జరిపించాలి
-ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

హిందూస్థాన్ మీడియా

నీట్ పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ప్రజాసంఘాల ప్రతినిధులు, సామాజిక వేత్తలు డిమాండ్ చేశారు. దీనిపై ప్రధాని మోదీ మౌనం వీడాలన్నారు. ఢిల్లీలో 19 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న సోనమ్ వాంగ్‌చుక్‌కు మద్దతుగా గురువారం నెక్లెస్ రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రగతిశీల, అభ్యుదయ, ప్రజాస్వామిక వాదులు దీపాల ప్రదర్శన నిర్వహించారు.




నీట్ పేపర్ లీకేజీపై పారదర్శకంగా దర్యాప్తు జరిపించి, బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలకు తావు లేకుండా పరీక్షల నిర్వహణలో సంస్కరణలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి వాంగ్‌చుక్ డిమాండ్లను నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యా కమిషన్ మాజీ అధ్యక్షుడు ఆకునూరి మురళీ, సీనియర్ ఎడిటర్ కె. శ్రీనివాస్, సోషల్ డెమొక్రటిక్ ఫోరం కన్వీనర్ ఆంజనేయులు, ప్రొఫెసర్ కె. లక్ష్మీనారాయణ, పద్మజా షా, పీవోడబ్ల్యూ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

### ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే.

నీట్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణం రాజీనామా చేయాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ సిరంగరాజ్, జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్.ఎ. స్టాలిన్ డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు పేదలను విద్యకు దూరం చేసేలా ఉన్నాయని విమర్శించారు. స్టాలిన్ మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడిచినా నేటికీ విద్యాశాఖకు మంత్రిని కేటాయించకపోవడం బాధాకరమన్నారు.

## సంక్షిప్త వార్తలు

హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ కీలక ఆదేశాలు.. ఇకపై కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో పాలాభిషేకాలు, జలాభిషేకాలు నిషేధం.. ఏఐసీసీ తెలంగాణ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ ఆదేశాలతో నిర్ణయం.. ఆహార పదార్థాల వృథా కాంగ్రెస్ సిద్ధాంతాలకు విరుద్ధం.. పాలాభిషేకాల బదులు ఆహార పంపిణీ కార్యక్రమాలు చేపట్టాలి–టీపీసీసీ



సైదాబాద్ సక్సెస్ స్కూల్ లో కల్మా కలకలం. విద్యార్థికి ఖురాన్ చదవాలని హోంవర్క్ ఇచ్చారంటూ ఆందోళన. సక్సెస్ స్కూల్ ను ముట్టడించడానికి వచ్చిన హిందూ సంఘాలు. అడ్డుకుని అరెస్ట్ చేసిన పోలీసులు. హోంవర్క్ ఇచ్చిన టీచర్ ని సస్పెండ్ చేశామన్న యాజమాన్యం. స్కూల్లో మతపరమైన బోధనలు చేయబోమంటున్న స్కూల్ మేనేజ్మెంట్. సక్సెస్ స్కూల్లో విద్యాశాఖ అధికారుల తనిఖీలు



తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాల పండుగ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వెల్లడి జగదీశ్ మందిరంలో అమ్మవారికి బోనం సమర్పించిన మంత్రులు పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్లేగు వ్యాధి నివారణ విశ్వాసంతో మొదలైన బోనాల ఆచారం మట్టి కుండలో బోనం సమర్పించడం సంప్రదాయం అదే సంప్రదాయాన్ని కొనసాగించాలని భక్తులకు పిలుపు మట్టి కుండల వినియోగంతో కుమ్మరుల జీవనోపాధికి ఊతం రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు, పంటలు పండాలని ప్రార్థనలు సంప్రదాయాల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత: పొన్నం ప్రభాకర్

23 అసెంబ్లీ నియోజకవర్గాలకు తెలంగాణ రక్షణ సేన ఇన్ ఛార్జీల నియామకం తన లక్కీ నంబర్ 5 వచ్చేలా 23 మంది ఇన్ ఛార్జీలను ప్రకటించిన పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత ఆషాఢ మాసంలో మంచి ముహూర్తంలో ఇన్ ఛార్జీలను ప్రకటించిన పార్టీ చీఫ్ దశలవారీగా రాష్ట్రంలోని మిగతా అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇన్ ఛార్జీలను ప్రకటించనున్న పార్టీ

ఏపీలో కోవిడ్ కేసులపై ప్రభుత్వం దృష్టి.. మంగళగిరి ఎయిమ్స్‌లో కోవిడ్ కేసు నమోదుపై సీఎం చంద్రబాబు ఆరా.. కోవిడ్‌పై అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచన.. రాపిడ్ టెస్ట్ కిట్లు అందుబాటులో ఉంచాలని సీఎం

## సింగరేణిలో మెడికల్ బోర్డు ఏర్పాటు...!

-హెచ్ఎంఎస్--తెలంగాణ రక్షణ సేన ఉద్యమ విజయమని ప్రకటన

-జూలై 17,18 తేదీల్లో మెడికల్ బోర్డు నిర్వహణకు నిర్ణయం

-ప్రతి నెలా మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలి

-వారసత్వ ఉద్యోగాల ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్

హిందూస్తాన్ మీడియా



సింగరేణి సంస్థలో మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలన్న తమ డిమాండ్‌కు యాజమాన్యం స్పందించడం ఉద్యమ విజయమని హెచ్ఎంఎస్,తెలంగాణ రాష్ట్ర రక్షణ సేన పేర్కొన్నాయి. గాంధేయ మార్గంలో చేపట్టిన నిరసనలు, ఆందోళనల ఫలితంగానే సింగరేణి యాజమాన్యం ఈ నెల జూలై 17,18 తేదీల్లో మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుందని సంఘాల నాయకులు తెలిపారు.మెడికల్ బోర్డు ఏర్పాటు చేయకుండా నెలల తరబడి కాలయాపన చేయడం వల్ల వేలాది మంది సింగరేణి కార్మికులు తీవ్ర మనోవేదనకు గురయ్యారని నాయకులు ఆరోపించారు. అనారోగ్య కారణాలతో మెడికల్ అన్‌ఫిట్ కోసం దరఖాస్తు చేసుకున్న ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం పట్టించుకోలేదని విమర్శించారు. మెడికల్ బోర్డు ఏర్పాటు కోసం పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినా స్పందన లేకపోవడంతో గాంధేయ పద్ధతిలో ఆందోళనలు చేపట్టామని,ఆ ఉద్యమ ఫలితంగానే యాజమాన్యం మెడికల్ బోర్డు నిర్వహించేందుకు అంగీకరించిందని పేర్కొన్నారు.అలాగే సింగరేణి కార్మికులకు వారసత్వ ఉద్యోగాలు హక్కుగా రావాల్సిందేనని హెచ్ఎంఎస్,తెలంగాణ రాష్ట్ర రక్షణ సేన స్పష్టం చేశాయి.అనారోగ్యంతో విధులు నిర్వహించలేని కార్మికులకు మెడికల్ అన్‌ఫిట్ ప్రకటించి,వారు సూచించిన కుటుంబ సభ్యులకు వారసత్వ ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశాయి.ఒక్కసారి మెడికల్ బోర్డు ఏర్పాటు చేయడం సరిపోదని,ప్రతి నెలా నిరంతరాయంగా మెడికల్ బోర్డును నిర్వహించాలని సంఘాలు డిమాండ్ చేశాయి.అలా చేస్తే దరఖాస్తుదారుల సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయని పేర్కొన్నాయి.అలాగే,మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న కార్మికుల కేసులను త్వరితగతిన పరిశీలించి,నిబంధనలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని కోరాయి.జూలై 17,18 తేదీల్లో మెడికల్ బోర్డు నిర్వహించాలనే నిర్ణయం వేలాది మంది సింగరేణి కార్మికుల ఐక్యపోరాటానికి దక్కిన విజయమని సంఘాల నాయకులు పేర్కొన్నారు.భవిష్యత్తులో కూడా కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# మిడ్ మానేరు నీటి కోసం రైతుల మహాధర్నా

-పొత్తూరు బ్రిడ్జిపై రాస్తారోకో!

-(రాజన్న సిరిసిల్ల - ఇల్లంతకుంట ) గొట్టపర్తి ముత్తయ్య )

హిందూస్థాన్ మీడియా





ఎండిపోతున్న పంటలను కాపాడాలని, మిడ్ మానేరు జలాశయం నుండి తక్షణమే సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లాలోని ఇల్లంతకుంట మండలం పొత్తూరు బ్రిడ్జిపై గురువారం రైతులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. కరీంనగర్ – కామారెడ్డి ప్రధాన రహదారిపై రైతులు బైఠాయించడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయి భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

-అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం

ఈ సందర్భంగా ఆందోళనకారులు మాట్లాడుతూ... కాళేశ్వరం ప్రాజెక్టు పంప్ హౌస్‌లు నీటిని పంపింగ్ చేయడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ, అధికారులు నీటి విడుదలలో తీవ్ర జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ ఉదాసీనత వల్లే తాము సాగు చేసిన వరి పంటలు కళ్ల ముందే ఎండిపోయే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. 'రాత్రింబగళ్లు కష్టపడి సాగు చేసిన పంటలు చేతికి వచ్చే తరుణంలో నీరు లేక ఎండిపోతున్నాయి. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తక్షణమే మిడ్ మానేరు నీటిని విడుదల చేసి మమ్మల్ని ఆదుకోవాలి."

-ఆందోళనకారుల డిమాండ్

భారీగా పోలీసుల మోహరింపు రైతుల ధర్నా విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయితే, నీటి విడుదలపై ఉన్నతాధికారుల నుండి స్పష్టమైన హామీ వచ్చే వరకు కదిలేది లేదని రైతులు భీష్మించుకు కూర్చున్నారు. పంటలు ఎండిపోకుండా యుద్ధప్రతిపదికన చర్యలు చేపట్టాలని, లేదంటే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని రైతులు హెచ్చరించారు.

# బీజేపీ నూతన అధ్యక్షుడు రాములుకు ఘన సన్మానం!

-ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్ష

గజ్వేల్/వర్గల్ (హిందూస్తాన్ మీడియా):

గజ్వేల్ నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నూతన కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికైన కుడిక్యాల రాములుకు గురువారం నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన పార్టీ శ్రేణులు, సీనియర్ నాయకులు ఘన సన్మానం చేశారు. కుడిక్యాల రాములుతో పాటు నియోజకవర్గ నూతన కార్యవర్గ సభ్యుడిగా నియమితులైన నాగులపల్లి పవన్ కుమార్‌ను కూడా పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వర్గల్ మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాలకు చెందిన ముఖ్య నేతలు నూతన కార్యవర్గానికి శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.

-ప్రజా సమస్యలపై పోరాడాలి.. బాధ్యతలపై హర్షం

?సన్మాన కార్యక్రమం అనంతరం వర్గల్ గ్రామ సీనియర్ నాయకులు మాట్లాడుతూ.. గజ్వేల్ నియోజకవర్గంలో బీజేపీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నూతన కమిటీ అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ, నియోజకవర్గ సమగ్ర వికాసం కోసం నూతన అధ్యక్షుడు కుడిక్యాల రాములు నేతృత్వంలో పార్టీ మరింత ముందుకు సాగుతుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన నాయకుల పదవీకాలం విజయవంతంగా సాగాలని, భవిష్యత్తులో వారు మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని ఈ సందర్భంగా నాయకులు కోరుకున్నారు.?బీజేపీ నూతన కమిటీకి అభినందనలు తెలిపిన ఈ సన్మాన వేడుకలో వర్గల్ గ్రామ సీనియర్ నాయకులు దిండి నాగరాజు గౌడ్, యశ్వంత్ రెడ్డి, నరేందర్ రెడ్డి, నూక బద్రీనాథ్, బబ్బురి వెంకటేష్‌తో పాటు గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాల బీజేపీ శ్రేణులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నూతన బాధ్యతలు స్వీకరించిన కుడిక్యాల రాములు, నాగులపల్లి పవన్ కుమార్ తమపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి మరియు శుభాకాంక్షలు తెలిపిన శ్రేణులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



# ల్యాండ్ చీటింగ్ కేసులో నిందితుడు అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు

-ఇతరుల భూమిని తనదిగా చూపించి లక్షలు వసూలు చేసినట్లు ఆరోపణ

-భూముల కొనుగోలు సమయంలో పత్రాలు తప్పనిసరిగా ధృవీకరించుకోవాలి

-సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్

హిందూస్తాన్ మీడియా

భూముల పేరుతో అమాయక ప్రజలను మోసం చేస్తున్న ఓ నిందితుడిని చివ్వెంల పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. లేని భూమిని ఉన్నట్లుగా, ఇతరులకు చెందిన భూమిని తనదిగా చూపిస్తూ ప్లాట్ల పేరుతో భారీ మొత్తంలో నగదు వసూలు చేసి మోసానికి పాల్పడుతున్న వ్యవస్థీకృత నేరస్థుడిని అరెస్టు చేసినట్లు సూర్యాపేట రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి. రాజశేఖర్ తెలిపారు. సూర్యాపేట రూరల్ సర్కిల్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఐ రాజశేఖర్ వివరాలు వెల్లడించారు. అయిలాపురం గ్రామ శివారులో ఉన్న భూమిని ప్లాట్లుగా విక్రయిస్తానని నమ్మబలికి,వాస్తవానికి ఇతరులకు చెందిన భూమిని తనదిగా చూపించిన కాసర్ల సురేందర్ రెడ్డి,కోడదల వెంకన్న,కోడదల కనకయ్యల నుంచి భారీ మొత్తంలో నగదు తీసుకున్నాడు.అనంతరం భూమిని రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో బాధితుడు కోడదల వెంకన్న చివ్వెంల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.కేసు దర్యాప్తు చేపట్టిన చివ్వెంల ఎస్ఐ మహేశ్వర్ విచారణలో సంబంధిత భూమి కాసర్ల సురేందర్ రెడ్డికి చెందినది కాదని,ఇతరుల భూమిని తనదిగా చూపించి బాధితులతో పాటు మరికొందరిని కూడా మోసం చేసినట్లు గుర్తించారు. దర్యాప్తులో సేకరించిన ఆధారాల మేరకు నిందితుడు కాసర్ల సురేందర్ రెడ్డిని అరెస్టు చేసి న్యాయస్థానం ముందు హాజరు పరచగా,కోర్టు రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు. ఇంకా బాధితులు ఉంటే ముందుకు రావాలి ఈ తరహా మోసాలకు గురైన మరిన్ని బాధితులు ఎవరైనా ఉంటే వెంటనే పోలీసులను సంప్రదించాలని సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్ కోరారు.భూముల కొనుగోలు, విక్రయాల సమయంలో సంబంధిత డాక్యుమెంట్లను క్షుణ్ణంగా పరిశీలించాలని, యాజమాన్య హక్కులను రెవెన్యూ అధికారుల ద్వారా ధృవీకరించుకున్న తర్వాతే లావాదేవీలు నిర్వహించాలని పోలీసులు ప్రజలకు సూచించారు. సంఘటితంగా భూముల మోసాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని సూర్యాపేట రూరల్ సీఐ జి.రాజశేఖర్ స్పష్టం చేశారు.



# భూ రీ-సర్వేలో క్షేత్రస్థాయిలో సంపూర్ణ పారదర్శకత పాటించాలి...

-జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

-సత్తుపల్లి మండల తహసీల్దారు కార్యాలయంలో భూ రీ-సర్వే పై సర్వేయర్లు, రెవెన్యూ అధికారులకు అవగాహన సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్..

హిందూస్తాన్ మీడియా

భూ భారతి చట్టం సమర్థవంతంగా అమలు కావాలంటే భూ రీ-సర్వేను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. బుధవారం సత్తుపల్లి మండల తహసీల్దార్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ లతో కలిసి మండల సర్వేయర్లు, గ్రామ పాలన అధికారులు, లైసెన్స్ సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బందికి భూ రీ-సర్వేపై అవగాహన సమావేశం నిర్వహించి కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ, భూ రీ-సర్వే ఉద్దేశం భూమిని విభజించడం కాదని, ఆ భూమిపై ప్రస్తుతం ఎవరు సాగు చేస్తున్నారు, వారి పేరుపై ఎంత భూమి నమోదై ఉంది, వారికి పట్టాదారు పాస్‌బుక్ ఉందా లేదా అనే అంశాలను మాత్రమే నిర్ధారించడమే రీ-సర్వే ప్రధాన లక్ష్యమని తెలిపారు. పట్టాదారు పాస్‌బుక్‌లో నమోదైన విస్తీర్ణం, క్షేత్రస్థాయిలో ఉన్న విస్తీర్ణం సరిపోతున్నాయా లేదా అన్న విషయాన్ని జాగ్రత్తగా పరిశీలించాలని, అసాధారణంగా ఎక్కువ లేదా తక్కువ విస్తీర్ణం నమోదైతే, దాని కారణాలను పూర్తిగా పరిశీలించి ధృవీకరించాలని సూచించారు. ప్రతి భూ రీ-సర్వే సమయంలో సంబంధిత రైతు వద్ద ఉన్న పట్టాదారు పాస్‌బుక్, పాత పహాణీలు, రిజిస్ట్రేషన్ పత్రాలు, సాగుకు సంబంధించిన ఇతర ఆధారాలు వంటి అన్ని పత్రాలను తప్పనిసరిగా సేకరించాలని అన్నారు. సర్వే నోటీసు అందించినట్లు రసీదు తీసుకోవడం, ఫోటోలతో కూడిన పంచనామా తయారు చేయడం, ఆధార్ కార్డు, మొబైల్ నంబర్ నమోదు చేయడం వంటి ప్రక్రియలను తప్పనిసరిగా పూర్తి చేయాలని అన్నారు. తిరుమలాయపాలెం మండలం కాకరవాయి గ్రామంలో ఇప్పటికే భూ రీ-సర్వే విజయవంతంగా నిర్వహించామని, ఆధునిక సర్వే పరికరాలతో గ్రామాల మధ్య సరిహద్దు సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు. అక్కడ ప్రజలు రీ-సర్వేపై సంతృప్తి వ్యక్తం చేశారని, కుటుంబ వివాదాలు మినహా పెద్దగా అభ్యంతరాలు రాలేదని కలెక్టర్ గుర్తు చేశారు. ఈ సమావేశంలో ఏడీ సర్వేయర్ రాజేందర్, సత్తుపల్లి మండల తహసీల్దార్ సత్యనారాయణ, సర్వేయర్లు, గ్రామ పాలనాధికారులు, లైసెన్స్ సర్వేయర్లు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# మద్దూరు KGBV లో స్పాట్ అడ్మిషన్లు

మద్దూరు, హిందుస్థాన్ మీడియా:

(ఆర్. కె. శ్రీను ) సిద్దిపేట జిల్లా మద్దూరు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (KGBV) & జూనియర్ కళాశాలలో 2026--27 విద్యా సంవత్సరానికి స్పాట్ అడ్మిషన్లు ప్రారంభమైనట్లు పాఠశాల స్పెషల్ ఆఫీసర్ స్వప్న తెలిపారు. ప్రస్తుతం 6వ తరగతిలో 10 సీట్లు, 7వ తరగతిలో 5 సీట్లు, 9వ తరగతిలో 8 సీట్లు, ఇంటర్ మొదటి సంవత్సరం వీూఎౌలో 5 సీట్లు, జజుజలో 15 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు.అర్హత కలిగిన బాలికలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని వెంటనే అడ్మిషన్ పొందాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 94939 72765 నంబర్‌ను సంప్రదించాలని ఎస్‌వో స్వప్న తెలిపారు

## బిజినెస్

# ప్రతి నెలా స్థిరమైన ఆదాయం కావాలా?
## ఈ పోస్టాఫీస్ స్కీమ్‌ను పరిశీలించొచ్చు



-పీఓఎంఐఎస్‌లో ఐదేళ్ల పాటు నెలవారీ ఆదాయం
-రిటైర్ అయిన వారికి ఎక్కువ అనుకూలం
-ప్రతి పెట్టుబడిదారుడికి సరిపోదంటున్న నిపుణులు
-మధ్యలో డబ్బు తీసుకుంటే షరతులు వర్తిస్తాయి
-వడ్డీపై ఆదాయపన్ను వర్తిస్తుంది
-ఇతర పెట్టుబడులతో కలిపి వినియోగించడం మేలంటున్న నిపుణులు

డబ్బు దాచుకోవడం ఒక్కటే కాదు.. ఆ దాచుకున్న డబ్బు నుంచి క్రమం తప్పకుండా ఆదాయం పొందాలనుకునే వారి సంఖ్య పెరుగుతోంది. ముఖ్యంగా రిటైర్మెంట్ తర్వాత జీతం ఉండదు కాబట్టి ప్రతి నెలా ఖర్చులకు ఒక స్థిరమైన ఆదాయం ఉండాలని చాలా మంది భావిస్తారు. అలాంటి సమయంలో 'పోస్టాఫీస్ మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్' (పీఓఎంఐఎస్) చాలామందికి గుర్తుకొచ్చే పథకం. అయితే ప్రభుత్వ పథకం కాబట్టి అందరి అవసరాలకు సరిపోతుందని అనుకోవడం సరికాదు. పెట్టుబడి పెట్టే ముందు ఈ పథకం మీకు సరిపోతుందా? లేదా? తెలుసుకోవడం ముఖ్యం.

**అసలు ఆకర్షణ ఇదే**

'పోస్టాఫీస్ మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్'లో పెట్టుబడి పెడితే ఐదేళ్ల పాటు ప్రతి నెలా నిర్ణీత వడ్డీ లభిస్తుంది. ప్రస్తుతం వడ్డీ రేటు 7.4 శాతంగా ఉంది. మార్కెట్‌లో హెచ్చుతగ్గులు వచ్చినా నెలవారీ ఆదాయంపై ప్రభావం ఉండదు. అందుకే రిటైర్డ్ ఉద్యోగులు, క్రమం తప్పకుండా నెలనెలా డబ్బు రావాలని కోరుకునే వారు ఈ పథకాన్ని ఎంచుకుంటారు. ఎక్కువ లాభాల కంటే స్థిరమైన ఆదాయానికి ప్రాధాన్యం ఇచ్చే వారికి ఇది అనుకూలం.

**ప్రతి ఒక్కరికీ సరిపోయే పథకం కాదు**

20-30 ఏళ్ల వయసులో పెట్టుబడులు పెట్టే వారి లక్ష్యాలు, రిటైర్ అయిన వారి అవసరాలు ఒకేలా ఉండవు. ఇంకా ఉద్యోగ జీవితంలో ఉన్నవారు భవిష్యత్తు కోసం సంపద పెంచే పెట్టుబడులను కోరుకుంటారు. ఇప్పటికే రిటైర్మెంట్ నిధి సిద్ధంగా ఉన్నవారు మాత్రం భద్రతతో పాటు నెలవారీ ఆదాయానికే ప్రాధాన్యం ఇస్తారు. అందుకే ఈ పథకం ఎంత బాగుందన్నది కాదు.. అది మీ ఆర్థిక లక్ష్యానికి సరిపోతుందా లేదా అన్నదే ముఖ్యం.

**డబ్బు అవసరమైతే**

ఈ పథకం కాలపరిమితి ఐదేళ్లు. మధ్యలో ఖాతా మూసేసే అవకాశం ఉన్నా కొన్ని షరతులు ఉంటాయి. అందుకే తక్కువ సమయంలోనే డబ్బు అవసరం ఉండే అవకాశం ఉంటే ఈ విషయాన్ని ముందే పరిగణనలోకి తీసుకోవాలి. నెలవారీ వడ్డీ వస్తోందని మాత్రమే చూసి నిర్ణయం తీసుకోవడం సరైన విధానం కాదని నిపుణులు సూచిస్తున్నారు.

**పన్ను వర్తిస్తుంది**

ఈ పథకం నుంచి వచ్చే వడ్డీ మొత్తం పూర్తిగా మీ చేతిలో మిగలదు. అది ఆదాయపన్ను శ్లాబ్‌కు అనుగుణంగా పన్ను పరిధిలోకి వస్తుంది. అలాగే ఈ పెట్టుబడికి ఆదాయపన్ను చట్టంలోని సెక్షన్ 80సీ కింద మినహాయింపు ఉండదు. అందుకే పన్ను చెల్లించిన తర్వాత మీకు నిజంగా ఎంత ఆదాయం మిగులుతుందో కూడా లెక్కలోకి తీసుకోవాలి.

**ఒక్క పథకంపైనే ఆధారపడొద్దు**

చాలామంది పెట్టుబడిదారులు తమ మొత్తం పొదుపును ఒకే పథకంలో పెట్టరు. నెలవారీ ఆదాయం కోసం పీఓఎంఐఎస్‌ను ఉపయోగిస్తూనే, మిగిలిన డబ్బును బ్యాంకు డిపాజిట్లు, మ్యూచువల్ ఫండ్ల వంటి ఇతర పెట్టుబడుల్లో ఉంచుతారు. ఇలా చేస్తే ఒకవైపు స్థిరమైన ఆదాయం లభిస్తుంది. మరోవైపు దీర్ఘకాల వృద్ధికి కూడా అవకాశం ఉంటుంది. అందుకే ఈ పథకాన్ని ఒక్కటే పరిష్కారంగా కాకుండా, మొత్తం పెట్టుబడి ప్రణాళికలో భాగంగా చూడాలని నిపుణులు సూచిస్తున్నారు.

# టీ20 క్రికెట్‌లో సరికొత్త చరిత్ర..
## మేజర్ లీగ్ క్రికెట్‌లో వరల్డ్ రికార్డ్స్ బద్దలు

## క్రీడలు





-ఎంఎల్‌సీ ఎలిమినేటర్‌లో ఎంఐ న్యూయార్క్‌పై వాషింగ్టన్ ఫ్రీడమ్ ఘన విజయం
-టీ20 క్రికెట్ చరిత్రలోనే అత్యధిక లక్ష్యాన్ని ఛేదించిన జట్టుగా ప్రపంచ రికార్డు
-విధ్వంసక సెంచరీలతో కదం తొక్కిన స్టీవ్ స్మిత్, ఆండ్రీస్ గౌస్
-పూరన్ ఫాస్టెస్ట్ సెంచరీ, పొలార్డ్ 1000 సిక్సర్ల మైలురాయి వృథా
-ఛాలెంజర్ మ్యాచ్‌లో శాన్‌ఫ్రాన్సిస్కోతో తలపడనున్న వాషింగ్టన్

మేజర్ లీగ్ క్రికెట్ (ఎంఎల్‌సీ) 2026 సీజన్‌లో పరుగుల సునామీ సృష్టించిన వాషింగ్టన్ ఫ్రీడమ్, టీ20 క్రికెట్ చరిత్రలోనే అత్యధిక లక్ష్యాన్ని ఛేదించి ప్రపంచ రికార్డు నెలకొల్పింది. ఎలిమినేటర్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా స్టార్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ (110 నాటౌట్) ఆకాశమే హద్దుగా చెలరేగడంతో డిఫెండింగ్ ఛాంపియన్ ఎంఐ న్యూయార్క్‌పై 6 వికెట్ల తేడాతో వాషింగ్టన్ చారిత్రక విజయం సాధించింది. ఈ గెలుపుతో వాషింగ్టన్ జట్టు ఛాలెంజర్ మ్యాచ్‌కు అర్హత సాధించింది. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన ఎంఐ న్యూయార్క్, నికోలస్ పూరన్ (31 బంతుల్లో 100) మెరుపు సెంచరీతో నిర్ణీత ఓవర్లలో 266 పరుగుల భారీ స్కోరు సాధించింది. పూరన్ ఎంఎల్‌సీ చరిత్రలోనే అత్యంత వేగవంతమైన శతకాన్ని నమోదు చేశాడు. అతనికి తోడుగా కీరన్ పొలార్డ్ (25 బంతుల్లో 64) కూడా సిక్సర్ల వర్షం కురిపించాడు. ఈ క్రమంలో పొలార్డ్ టీ20 క్రికెట్‌లో 1,000 సిక్సర్లు కొట్టిన రెండో ఆటగాడిగా (క్రిస్ గేల్ తర్వాత) రికార్డు సృష్టించాడు. 267 పరుగుల అసాధ్యమనుకున్న లక్ష్యంతో బరిలోకి దిగిన వాషింగ్టన్ ఫ్రీడమ్, ఆరంభంలో 10 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన స్టీవ్ స్మిత్, వికెట్ కీపర్ ఆండ్రీస్ గౌస్ (51 బంతుల్లో 132) కలిసి విధ్వంసం సృష్టించాడు. వీరిద్దరూ మూడో వికెట్‌కు రికార్డు స్థాయిలో 241 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశారు. కేవలం 48 బంతుల్లో 7 ఫోర్లు, 9 సిక్సర్లతో 110 పరుగులు చేసిన స్మిత్ అజేయంగా నిలిచి జట్టును గెలిపించాడు. దీంతో వాషింగ్టన్ 18.4 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. ఇప్పటివరకు టీ20ల్లో అత్యధిక ఛేదన రికార్డు (265) ఐపీఎల్ 2026లో పంజాబ్ కింగ్స్ పేరిట ఉండేది. ఇప్పుడు వాషింగ్టన్ ఆ రికార్డును బద్దలుకొట్టింది. గతేడాది ఫైనల్‌లో ఎంఐ న్యూయార్క్ చేతిలో ఓటమి పాలైన వాషింగ్టన్, ఈ విజయంతో ప్రతీకారం తీర్చుకుంది. ఇవాళ జరిగే ఛాలెంజర్ మ్యాచ్‌లో వాషింగ్టన్ ఫ్రీడమ్, శాన్‌ఫ్రాన్సిస్కో యునికార్న్స్‌తో తలపడుతుంది. ఇందులో గెలిచిన జట్టు ఈ నెల 18న జరిగే ఫైనల్‌లో లాస్ ఏంజిల్స్ నైట్ రైడర్స్‌ను ఢీకొంటుంది.

# అర్జెంటీనాకు అనుకూలం అంటూ ఫిఫాపై ఆరోపణలు.. ఎట్టకేలకు మౌనం వీడిన మెస్సీ

-అర్జెంటీనాకు ఫిఫా సహకరిస్తోందన్న వ్యాఖ్యలకు మెస్సీ గట్టి సమాధానం
-కష్టపడి ఆడి ఫైనల్‌కు చేరామని స్పష్టీకరణ
-తమకు అనుకూలంగా ఎవరూ ఏదీ ఇవ్వలేదని వ్యాఖ్య
-ఇంగ్లండ్‌పై గెలిచి ఫైనల్‌కు చేరిన అర్జెంటీనా
-వీఏఆర్, రిఫరీ నిర్ణయాలపై కొనసాగుతున్న విమర్శలు



వరల్డ్ కప్‌లో అర్జెంటీనాకు ఫిఫా అనుకూలంగా వ్యవహరిస్తోందంటూ వస్తున్న ఆరోపణలపై ఆ జట్టు కెప్టెన్ లియోనెల్ మెస్సీ ఎట్టకేలకు స్పందించాడు. తమ విజయాల్లో ఎలాంటి పక్షపాతం లేదని స్పష్టం చేశాడు. కష్టపడి ఆడిన ఫలితంగానే ఈ స్థాయికి చేరుకున్నామన్నాడు. ఎవరూ తమకు అనుకూలంగా ఏదీ ఇవ్వలేదని, ప్రతి గోల్ వెనుక ఎంతో కష్టం ఉందని తేల్చిచెప్పాడు. సెమీఫైనల్లో ఇంగ్లండ్‌పై అర్జెంటీనా విజయం సాధించి వరుసగా రెండోసారి ఫైనల్‌కు చేరిన విషయం తెలిసిందే. "మేం గత నాలుగేళ్లుగా అత్యుత్తమ జట్టుగా నిలిచాం. ఎవరికి నచ్చినా, నచ్చకపోయినా వాస్తవం మారదు. వరుసగా రెండు ప్రపంచకప్ ఫైనల్స్‌కు చేరడం చాలా అరుదైన విషయం. మేం సాధించింది అదృష్టంతో కాదు. మా ఆటతోనే ఈ స్థాయికి వచ్చాం" అని మెస్సీ విమర్శకులకు గట్టిగా బదులిచ్చాడు. ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లో ఓడిపోయి ఉంటే మరోసారి ఎన్నో ఆరోపణలు వచ్చేవని కూడా మెస్సీ వ్యాఖ్యానించాడు. అయితే మైదానంలో తామే మెరుగైన జట్టుగా నిలిచామని, అందుకే ప్రత్యర్థికి అలాంటి అవకాశం ఇవ్వలేదని చెప్పాడు. ఇలాంటి కీలక మ్యాచ్‌ల్లో చరిత్ర సృష్టించే సంఘటనలు జరుగుతుంటాయని పేర్కొన్నాడు. ఈ ప్రపంచకప్‌లో అర్జెంటీనాకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు గ్రూప్ దశ నుంచే మొదలయ్యాయి. అల్జీరియాతో మ్యాచ్‌లో మెస్సీ చేసిన టాకిల్‌పై చర్యలు తీసుకోలేదంటూ ఆ దేశం అధికారికంగా ఫిర్యాదు చేసింది. ఈజిప్ట్‌తో మ్యాచ్‌లో వీఏఆర్ నిర్ణయం, స్విట్జర్లాండ్‌తో మ్యాచ్‌లో రిఫరీ నిర్ణయాలపై కూడా పెద్ద ఎత్తున చర్చ జరిగింది. ఈ పరిణామాల తర్వాత అర్జెంటీనాకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటున్నారన్న విమర్శలు సోషల్ మీడియాలో మరింత పెరిగాయి.

# నోలన్ 'ది ఒడిస్సీ' సినిమాకు వెళుతున్నారా? అరగంట ముందే థియేటర్‌కు చేరుకోండి!

-క్రిస్టోఫర్ నోలన్ 'ది ఒడిస్సీ' చిత్రానికి ప్రేక్షకుల విజ్ఞప్తి

-థియేటర్లకు 30 నిమిషాల ముందే రావాలని సూచన

-కొన్ని ఐమ్యాక్స్ స్క్రీనింగ్‌లలో ప్రత్యేక కంటెంట్ ప్రదర్శించే అవకాశం

-భారీ అంచనాలతో ప్రపంచవ్యాప్తంగా విడుదల




ప్రఖ్యాత హాలీవుడ్ దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కించిన 'ది ఒడిస్సీ' చిత్రం కోసం సినీ ప్రేక్షకులు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రం శుక్రవారం (జులై 17) విడుదల కానుంది. అయితే, సినిమా వీక్షించేందుకు వచ్చే ప్రేక్షకులు, మరీ ముఖ్యంగా ఐమ్యాక్స్ స్క్రీన్‌లలో చూసేవారు, కనీసం 30 నిమిషాల ముందే థియేటర్లకు చేరుకోవాలని చిత్ర బృందం సూచించింది. ఈ చిత్రాన్ని సంపూర్ణంగా అధునాతన ఐమ్యాక్స్ కెమెరాలతో చిత్రీకరించారు. ప్రేక్షకులకు అద్భుతమైన దృశ్యానుభూతిని అందించే క్రమంలో, కొన్ని ఎంపిక చేసిన ఐమ్యాక్స్ 70ఎంఎం స్క్రీనింగ్‌లలో ప్రధాన చిత్రం ప్రారంభానికి ముందు ప్రత్యేక కంటెంట్‌ను ప్రదర్శించే అవకాశం ఉంది. దీనిలో భాగంగా, డెనిస్ విల్లేనువే దర్శకత్వంలో రాబోతున్న 'డూన్: పార్ట్ త్రీ' చిత్రానికి సంబంధించిన నాలుగు నిమిషాల ప్రోలోగ్‌ను ప్రదర్శించవచ్చని ప్రచారం జరుగుతోంది. గతంలోనూ నోలన్ తన 'ది డార్క్ నైట్', 'ది డార్క్ నైట్ రైజెస్' చిత్రాల ప్రమోషన్ కోసం ఇదే తరహా వ్యూహాలనే అనుసరించడం గమనార్హం. సాధారణంగా భారీ చిత్రాల విడుదల సమయంలో తలెత్తే ట్రాఫిక్ ఇబ్బందులు, టికెట్ స్కానింగ్ ప్రక్రియ మరియు రద్దీగా ఉండే హాల్స్‌లో సీట్లను వెతుక్కోవడం వంటి కారణాల వల్ల ప్రేక్షకులకు ఆలస్యమయ్యే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో నిర్ణీత సమయం కంటే ముందుగానే థియేటర్‌లకు చేరుకోవడం ఉత్తమమని విశ్లేషకులు సూచిస్తున్నారు. కాగా, ఈ చిత్రాన్ని నోలన్ ఆశించిన పూర్తిస్థాయి ఐమ్యాక్స్ 70ఎంఎం ఫార్మాట్‌లో ప్రదర్శించే థియేటర్లు ప్రపంచవ్యాప్తంగా కేవలం 41 మాత్రమే ఉన్నాయి. ఇప్పటికే పలు ప్రాంతాల్లో ప్రారంభ వారాంతపు టిక్కెట్లు హాట్ కేకుల్లో అమ్ముడయ్యాయి. హోమర్ రచించిన గ్రీకు ఇతిహాసం 'ది ఒడిస్సీ' ఆధారంగా రూపొందిన ఈ చిత్రంలో ప్రధాన పాత్ర అయిన ఒడిస్సియస్‌గా మ్యాట్ డామన్ నటించగా, యాన్ హత్వే, టామ్ హాలండ్, జెండాయా వంటి ప్రముఖ తారాగణం కీలక పాత్రలు పోషించారు. సుమారు 2 గంటల 52 నిమిషాల నిడివి గల ఈ చిత్రంపై, లండన్ ప్రీమియర్ షో అనంతరం అద్భుతమైన సమీక్షలు వెలువడుతున్నాయి.ాంకేతికంగానూ, భావోద్వేగాల పరంగానూ సినిమా అత్యున్నత స్థాయిలో ఉందంటూ ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.



## డబ్బుల కోసమే సినిమాల్లోకి వచ్చా.. ఒకప్పుడు కూలీ పని కూడా చేశా: విజయ్ సేతుపతి

-చిన్నప్పుడు తన కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉండేదన్న విజయ్ సేతుపతి

-అప్పులవాళ్లు ఇంటిపైకి గొడవకు వచ్చేవారని వెల్లడి

-సినిమాల్లోకి రాకముందు ఎన్నో పనులు చేసిన సేతుపతి

సినిమా పరిశ్రమలో ఎలాంటి గాడ్‌ఫాదర్ లేకుండా, కేవలం తన అద్భుత నటనతో 'మక్కల్ సెల్వన్' (ప్రజల నటుడు)గా ఎదిగిన విజయ్ సేతుపతి.. తమిళ, తెలుగు ప్రేక్షకులలో సంపాదించుకున్న గుర్తింపు ప్రత్యేకమైనది. ఇటీవల జరిగిన ఒక ఇంటర్వ్యూలో ఆయన తన చిన్ననాటి కష్టాలు, కుటుంబ ఆర్థిక ఇబ్బందుల గురించి పంచుకున్న విషయాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. "చిన్నప్పుడు మా కుటుంబం తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉండేది. మా నాన్న మా కోసమే చాలా అప్పులు చేశారు. అవి తీర్చలేక సతమతమయ్యేవాళ్లం. కొన్నిసార్లు అప్పులవాళ్లు మా ఇంటిపైకి గొడవకు వచ్చేవారు. ఆ సమయంలో మా నాన్న ఒంటరిగా బాధపడకూడదని నేను ఎప్పుడూ ఆయన పక్కనే కూర్చునేవాడిని" అని సేతుపతి గుర్తుచేసుకున్నారు. ఎన్ని కష్టాలున్నా ప్రతిరోజు రాత్రి 9.30 గంటలకు నాన్న బుల్లెట్ బండిపై వస్తూ ఫ్రైడ్ రైస్ తెచ్చేవారని, కుటుంబమంతా కలిసి దాన్ని పంచుకుని తినే ఆ క్షణాలు తన జీవితంలో మర్చిపోలేని మధుర జ్ఞాపకాలని చెప్పారు. నటుడు అవ్వాలనేది విజయ్ సేతుపతి లక్ష్యం కాదట. కేవలం కుటుంబ బాధ్యతలు, డబ్బుల కోసమే ఆయన రంగుల ప్రపంచంలోకి అడుగుపెట్టారు. సినిమాల్లోకి రాకముందు ఆయన స్కూల్ రోజుల్లో కూలీ పనికి వెళ్లారు. ఆ తర్వాత రిటైల్ స్టోర్‌లో సేల్స్‌మ్యాన్‌గా, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో క్యాషియర్‌గా, ఫోన్ బూత్ ఆపరేటర్‌గా పనిచేశారు. ఆ తర్వాత దుబాయ్ వెళ్ళి అక్కడ అకౌంటెంట్‌గానూ ఉద్యోగం చేశారు. దుబాయ్ నుంచి ఇండియాకు తిరిగి వచ్చిన తర్వాత నాటక రంగానికి చెందినవారితో ఏర్పడిన పరిచయమే విజయ్ సేతుపతి జీవితాన్ని మలుపు తిప్పింది. మొదట్లో సినిమాల్లో చిన్న చిన్న క్యారెక్టర్లు చేస్తూ.. 'తెన్మేర్కు పరువకాట్రు' చిత్రంతో హీరోగా మారారు. ఆ తర్వాత 'సూదు కవ్వమ్', 'విక్రమ్ వేద', 'పిజ్జా', 'మహారాజా' వంటి విలక్షణమైన చిత్రాలతో స్టార్ హీరోగా నిలదొక్కుకున్నారు. ప్రస్తుతం ఆయన హీరోగా నటించిన 'ట్రైన్', 'స్లమ్ డాగ్' సినిమాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి.



# 'ది కాల్' మూవీ రివ్యూ!

హారర్ థ్రిల్లర్ సినిమాలకు ఓటీటీ ఫ్లాట్ ఫామ్స్ పై ఎప్పుడూ మంచి ఆదరణ లభిస్తూ ఉంటుంది. ఈ జోనర్ నుంచి వచ్చిన సినిమాలను భాషతో సంబంధం లేకుండా ఆడియన్స్ చూస్తుంటారు. అందువల్లనే ఈ జోనర్ సినిమాలను ఎక్కువగా వదలడానికి ఓటీటీ సంస్థలు పోటీపడుతూ ఉంటాయి. అలా రూపొందిన సినిమానే 'ది కాల్'. 2020 నవంబర్లో విడుదలైన ఈ సౌత్ కొరియన్ సినిమా, ఆ తరువాత ఓటీటీ సెంటర్లలోకి అడుగుపెట్టింది. అయితే తాజాగా 'జియో హాట్ స్టార్' లో తెలుగులోను అందుబాటులోకి వచ్చింది. ఈ నెల 10వ తేదీ నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. అది సిటీకి దూరంగా ఉన్న ఒక మారుమూల గ్రామం. అక్కడ ఎడిత్ క్రాన్స్ టన్ (లిన్ షేయ్) అనే ఒక వృద్ధురాలు ఒంటరిగా నివసిస్తూ ఉంటుంది. క్రాన్స్ భర్త ఎక్కువగా ట్రావెలింగ్ లో ఉండటం వలన, ఆమె భయపడుతూనే రోజులు గడుపుతూ ఉంటుంది. ఆమె రూపం.. చిత్రమైన ధోరణి కారణంగా మంత్రగత్తె అనే ఒక పేరు పడిపోతుంది. కొంతమంది ఆకతాయిలు ఆమెను మరింత ఇబ్బందిపెడుతూ ఉంటారు. తన చెల్లెలు 'లారా' కనిపించకపోవడానికి క్రాన్స్ కారణమని 'తానియా' భావిస్తుంది. ఆమెనే లారాను ఏదో చేసి ఉంటుందని ప్రచారం చేస్తుంది. తన స్నేహితులైన క్రిస్ .. బ్రెడ్ .. జాక్ తో కలిసి క్రాన్స్ ఇంటిపైకి వెళుతుంది. రాళ్లు విసురుతూ ఆమె ఇంటి అద్దాలను పగులగొడతారు. ఆ తరువాత ఆమె చనిపోయిందని తెలుసుకుని వాళ్లంతా ఆశ్చర్య పోతారు. ట్రావెలింగ్ నుంచి వచ్చిన క్రాన్స్ భర్త, ఆ నలుగురు స్నేహితులను తన ఇంటికి పిలిపిస్తాడు. తన భార్య ఆత్మ హత్య చేసుకుందనీ, ఆమె బాడీతో పాటు ఫోన్ ను కూడా ఖననం చేశానని చెబుతాడు. తన ఇంట్లోని మేడ పై గదిలోకి ఒక్కొక్కరుగా వెళ్లి, ఆ నెంబర్ కి కాల్ చేసి ఒక నిమిషం మాట్లాడమని కోరతాడు. నిమిషం పాటు మాట్లాడినవారికి, పెద్ద మొత్తంలో నగదు బహుమతిని అందజేస్తానని చెబుతాడు. అలా చేయకపోతే తన భార్య రాసిన సూసైడ్ లెటర్ ను పోలీసులకు అందజేస్తానని బెదిరిస్తాడు. దాంతో అతను చెప్పినట్టుగా చేయడానికి వాళ్లు అంగీకరిస్తారు. ఒక్కొక్కరుగా మేడపైకి వెళతారు. అక్కడ ఏం జరుగుతుంది? వెళ్లినవాళ్లు తిరిగొస్తారా లేదా? అనేది మిగతా కథ. ఆత్మహత్య చేసుకున్నవాళ్లు దెయ్యాలుగా మారతారా? బ్రతికున్నపుడు తమని అదే పనిగా వేధిస్తూ వచ్చినవాళ్లపై ప్రేతాత్మలు పగబడతాయా? అలాంటివాళ్లపై ప్రతీకారం తీర్చుకుంటాయా? అనే ప్రశ్నలకు సమాధానంగా ఈ సినిమా కథను అల్లుకున్నారు. ఆకతాయి చేష్టలతో తనని వేధించిన ముగ్గురు యువకులు .. ఒక యువతిపై ఒక ప్రేతాత్మ ఎలా ప్రతీకారం తీర్చుకుంటుంది? అనే అంశం చుట్టూనే ఈ కథ తిరుగుతుంది. వృద్ధురాలు చనిపోవడం .. ఆమె ఆత్మహత్యకు కారకులైన నలుగురు ఫ్రెండ్స్ ను ఆమె భర్త పిలిపించడం .. వాళ్లకి ఒక టాస్క్ ఇవ్వడం వరకూ ఈ కథ ఇంట్రెస్టింగ్ గానే అనిపిస్తుంది. ఇక ప్రేతాత్మతో ఫోన్లో మాట్లాడటానికి ఒక్కొక్కరూ మేడపైకి వెళుతుంటే, అసలు కథ మొదలైందనే ఒక కుతూహలం పెరుగుతూ పోతుంది. అయితే ఆ క్యూరియాసిటీ ఎంతోసేపు నిలబడదు. ఎందుకంటే ఆడియన్స్ భయపడేంత స్థాయిలో అక్కడ ఏమీ జరగదు. మేడపైకి వెళ్లిన వాళ్లు ఒక ప్రత్యేకమైన జోన్ లోకి వెళ్లిపోవడం వరకూ బాగానే ఉంది. అయితే అక్కడ లైటింగునుగానీ, ప్రేతాత్మకి సంబంధించిన జుగుప్సాకరమైన సన్నివేశాలనుగాని చూడలేము. భయంతో ముచ్చెమటలు పట్టేంత సీన్ .. అక్కడ ఏ సీన్ కి లేదు. మొబైల్ ను శవంతో పాటు పెట్టేసి పూడ్చేయడం, ఆ నెంబర్ కి కాల్ చేస్తే ప్రేతాత్మ మాట్లాడటం వంటి సన్నివేశాలు చాలా సిల్లీగా అనిపిస్తాయి. సాధారణంగా దెయ్యాల కథలన్నీ దాదాపు ఒక ఇంటిపరిమితమవుతూ ఉంటాయి. ఆ ఇంటి గేటుదాటి దెయ్యాలు బయటికి రావు. బయట పాత్రలు లోపలికి వెళతాయి అంతే. పైగా ఈ తరహా కథలకు పెద్దగా తారాగణం అవసరం లేదు. చాలా తక్కువ మందితో .. తక్కువ బడ్జెట్ లో కానిచ్చేస్తూ ఉంటారు. అలాంటి ఒక కాన్సెప్ట్ తో రూపొందిన సినిమానే ఇది. ఒక్కమాటలో చెప్పాలంటే రియాలిటీ షోను గుర్తుకు చేసే కంటెంట్ ఇది. ఆర్టిస్టుల నటన గురించి గొప్పగా చెప్పుకోవడానికేమీ లేదు. ఫొటోగ్రఫీ .. నేపథ్య సంగీతం .. ఎడిటింగ్ ఓ మాదిరిగా అనిపిస్తాయి. హారర్ సినిమాలను ఇష్టపడే ఆడియన్స్ కి చాలా సాధారణంగా అనిపించే కాన్సెప్ట్ గా ఈ సినిమా మిగిలిపోతుందని చెప్పచ్చు.




Publisher: AKULA SWATHI , printed at SUNDAY PRINTING PRESS, FLAT. NO.363B,1st FLOOR,MADHAVARAM NAGAR COLONY ,RANGAREDDY, TELANGANA - 500072 .
Published at H.NO.15-56/1, Village & Mandal CHERIAL , SIDDIPET District ,Telangana state - 506223, Editor :THADEM PRASHANTH Cell :9000306455